# శాపం

శంకమంచి పార్ధసారధి

రాజమ్మ నడుస్తోంది వడి వడిగా, వేగంగా నడుస్తోంది. చేతిలో సత్తు టిఫిను, దాన్నిండా కొడుక్కిష్టమయినపదార్థాలు, అన్నం.

బుర్రనిండా ఆ రోజు తనకి జరిగిన అవమానం, కళంకం గూర్చిన ఆలోచన్లు, గుండెలనిండా మంటా – నింపుకుని నడుస్తోంది.

నడుస్తున్న రాజమ్మ ఇంటిని సమీపించింది. కాని అక్కడి వాతావరణం ప్రతిరోజులా లేదు. అక్కడి గాలి ఆందోళనతో నిండింది.

రాజమ్మకి గుండె ఆగినంత పనైంది. ఆమె ఇంటికి కాస్త దూరంలో జనం. విపరీతమయిన జనం. అందరూ గుసగుసలాడుతున్నారు. పోలీసులు మధ్యలో. వాళ్ళందరికీ మధ్యలో ఒక చిన్న కారు – దాని క్రింద......

రాజమ్మ ఆదుర్దాగా దగ్గరకెళ్ళింది. ప్రక్కింటి సీతమ్మ ఒక్క ఉదుటునొచ్చి రాజమ్మని చుట్టుకుంది.

" రాజమ్మా ! నీ రాములేడే – ఆ కారు ఆడిని మింగేసింది " అంది.

అంతే ! రాజమ్మ మండుతన్న గుండె పేలిపోయింది.

రాములు – తన కొడుకు చనిపోయాడు – కారుకిందపడి.

చేతిలోని సత్తు టిఫిను పట్టుతప్పి కిందపడింది. కొడుక్కోసం తెచ్చిన అన్నం మట్టిపాలైంది.

పోలీసులు ఫోటోలు తీస్తున్నారు, కొలుస్తున్నారు, గీతలు గీస్తున్నారు. చాలా హడావిడిగా ఉన్నారు.

రాజమ్మ – కళ్ళకి చిల్లులు పడ్డట్టుగా ఏడుస్తోంది. ఏడుస్తూనే మెల్లిగా జనాన్ని తప్పించుకుని ముందుకెళ్ళింది.

రాములు బల్లిలా నేలకి అంటుకుపోయాడు. పొద్దున నవ్వుతూ పంపిన మొహం, నామరూపాల్లేకుండాపోయింది. చక్రం తలమీంచి పోవటంవల్ల, అతడిని పోల్చుకోవటం కూడా కష్టం అనిపించింది.

రాజమ్మ ఘోల్లుమంటూ కూర్చుండిపోయింది. అందరూ సానుభూతి మాటలతో ఆమెని సముదాయించాలని ప్రయత్నిస్తున్నారు.

ఒక్కసారి కళ్ళు తుడుచుకుని మళ్ళీ కొడుకువంక చూసుకుంది. అక్కడినుంచి చూపుని మరల్చి, కారువంక చూసింది కసిగా.

ఒక్కసారి ఒళ్ళు ఝల్లుమంది !

ఆ కారు తనకి తెల్సు. అది ఎవరిదో, దాని డ్రైవరెవడో తెల్సు తనకి.

ఆ కారు రంగరాజుది – తన యజమాని స్నేహితుడు. దానికి డ్రైవరెవడో కాదు – తన భర్త నాగయ్య.

కాని భర్తజాడ అక్కడెక్కడా కానరాక, మెల్లిగా అడిగింది – “ కార్లో ఎవరున్నారు ? ఎవరూ చూళ్ళేదా ? ” అని.

సీతమ్మ నిష్ఠూరంగా అంది. “ చూడకేం తల్లీ నేనిక్కడే కూర్చున్నా. ఏ మూలనించి వచ్చిందో పాడుకారు ఆడిని మింగేసింది. ఆ కార్లోవోడు యముడల్లే వున్నాడు కళ్ళు సింతనిప్పుల్లా ఉన్నాయ్. తాగున్నాడేమో సచ్చినోడు – తూలుతున్నాడు. కారు దిగి ఏం జరగనట్టు వెళ్ళిపోయాడు. ఎదవసచ్చినోడు..... ” ఇంకేదో చెబుతూనే ఉంది.

కానీ రాజమ్మ వినటం లేదు. లేచి నుంచుంది.

ఆశ్చర్యం ! ఇప్పుడామెకి కొడుకు పోయాడన్న దు:ఖం దిగులు లేవు. వాటి స్థానంలో కసి, పగ నిండినాయ్.

ఆమె ప్రవర్తనకి అందరూ విస్తుపోయారు. ‘ మతి చలించిందేమో ’నన్నారు కొందరు. కాని ఆమెకి అవేమీ వినిపించటంలేదు.

తన కొడుకుపోవటం – అంతకన్నా ముందు తన పవిత్రమైన శరీరం, నిర్మలమైన మనస్సు కలుషితం కావటం – ఈ రెండింటికి కారకుడు – రంగరాజు.

తన యజమాని శ్రీపతి స్నేహితుడు.

అతడి పట్ల ఆమెకేర్పడ్డ కసి, పగ, ద్వేషం ఆమెని ఉన్మత్తురాలిని చేశాయ్.

☆ ☆ ☆

రాజమ్మ రెండేళ్ళుగా శ్రీపతి ఇంట్లో వంటపని చేస్తోంది. శ్రీపతి భార్యకు రాజమ్మమీద అంతులేని నమ్మకం, గురి, శ్రీపతికి ఆమె మీద జాలి, అభిమానం.

అడపా దడపా వాళ్ళింటికొచ్చే రంగరాజుకి దానిమీద విపరీతమయిన కోర్కె !

రాజమ్మ మొగుడు నాగయ్య లారీ డ్రైవరుగా పనిచేసేవాడు. వాడుకున్నదల్లా ఒక్కటే వ్యసనం – తాగుడ. సంపాదించినదంతా వాడి తాగుడుకే సరిపోయేది. రాజమ్మ వాడిని మార్చాలని చాలా విధాలుగా ప్రయత్నించింది. కానీ ఫలితం శూన్యం. ఆమెకి సంసారం గడపటం కష్టం అనిపించింది.

అటువంటి పరిస్థితుల్లో శ్రీపతింట్లో వంటకి  కుదిరింది వాళ్ళు రాజమ్మని వంటమనిషిలా కాకుండా ఇంట్లో మనిషిలా చూచుకోసాగారు. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా వాళ్ళకి చెప్పుకునేది. దాని మొగుడు నాగయ్యని – ఉద్యోగంలోంచి త్రాగి లారీ నడుపుతున్నాడన్న నెపంతో తీసేసినప్పుడు – శ్రీపతే ఆమె పరిస్థితికి జాలిపడి రంగరాజు కారు డ్రైవరఁగా కుదిర్చాడు.

రంగరాజు, తరచుగా శ్రీపతింటిక వస్తుండేవాడు. అతడికి వాళ్ళింట్లో చాలా చనువు. కానీ రాజమ్మకి మాత్రం అతడంటే ఎంతమాత్రం గిట్టేది కాదు. కారణం  – అతడి ఆకలి చూపులు, కొంటెగా కన్ను గీటటం, ద్వంద్వార్ధపు మాటలు, అతడిని చూస్తేనే తగని చిరాగ్గా వుండేది.

‘ కానీ తనేం చెయ్యగలదు ? ఆ ఇంట్లో తను వంట మనిషి మాత్రమే ’ అని సరిపెట్టుకోసాగింది. అందుకే  అతడిని,  అతడి చేష్టల్ని పట్టించుకోవటం మానేసింది.

రాజమ్మకి తెల్సు – అతడి వల్ల తనకెప్పటికైనా ముప్పు తప్పదని, కానీ ఆరోజు ఇంత త్వరగా వస్తుందని అనుకోలేదు. ఆరోజు వుదయం అతడొచ్చేసిరికి ఇంట్లో ఎవరూ లేరు. శ్రీపతి బయటికెళ్ళాడు. భార్య వూరెళ్ళింది. రాజమ్మ వంటగదిలో పనిలో తలమునకలుగా వుంది అంతలో తలుపు చప్పుడైంది.

వెళ్ళి తలుపు తీసి పులిని చూసిన మేకలా భయపడ్డది వచ్చిన రంగారాజుని చూసి.

భయం భయంగానే అంది – “ అయ్యగారింట్లో లేరు ” అని. “ అమ్మగారూ ? ” అనుమానంగా అడిగాడు రంగరాజు.

“ వూరెళ్ళారు ”

“ సర్లే నువ్వెళ్ళి నీ  పన్చూసుకో. నే కాసేపు కూకుని శ్రీపతి వత్తాఏమో చూసి యెల్తా” అన్నాడు.లోపలికి అడుగెడుతూ

" దయచేసి వెళ్ళి, అయ్యగారొచ్చాక రండి " అని చెప్పాలనకుంది. కానీ, అది తన తొందరపాటవుతుంది. శ్రీపతికి తెలిస్తే మరోవిధంగా పరిణమించవచ్చు !

అందుకే మౌనంగా వంటింట్లోకి నడిచింది. పది నిముషాల తర్వాత, వెనకాల అలికిడయి వులిక్కిపడి చూసింది. రంగారాజు తలుపు పట్టుకుని నిలబడున్నాడు. చూపుల్లో ఆకలి, నవ్వులో క్రూరత్వం, మొహంలోని మొరటుతనం – రాజమ్మని భయపెట్టాయి.

ఏమీ మాట్లాడకుండా భయంగా ఒక మూలగా వొదిగి నిలబడింది. మనిషి భయంతో కంపించేటప్పుడు, ఏదో చేయాలన్న ఆవేశంలో వున్నప్పుడు – నోటి వెంట మాటలు రావు. కొన్ని క్షణాలు ఇద్దరూ అలాగే నిలబడ్డారు.

రంగరాజు ముందుగా తేరుకుని, ముందుకు రావాలని ప్రయత్నిస్తూ, " ఎవ్వరూ లేరుగా – దా – నా ముచ్చట తీర్చు ! నీకేంకావాలో అడుగు " అన్నాడు

" దయచేసి వెళ్ళిపోండి – నేనలాంటి దాన్ని కాదు ". భయంగా, దూరం దూరంగా జరుగుతూ అంది రాజమ్మ.

రంగరాజు నవ్వాడు – నవ్వి, " ఆ మాటకొస్తే, నేనూ అలాంటోడిని కాను. ఎన్నాళ్ళనించో నీ మీద కోర్కె పెంచకున్నా. ఈనాటికి అవకాశం వచ్చింది " అంటూ పూర్తిగా వంటగదిలో కొచ్చేశాడు.

రాజమ్మకేం చెయ్యాలో తోచలేదు. అతడిని తప్పించుకుని బయటికి పరిగెత్తాలని ప్రయత్నించింది.

అదే అదునుగా రంగరాజు చటుక్కున రాజమ్మని పట్టుకుని బలంగా గుండెల కత్తుకున్నాడు.

☆ ☆ ☆

నడుస్తున్న రాజమ్మ కాళ్ళు ఠక్కున ఆగినాయ్. ఎదురుగా రంగరాజు బంగళా.

ఆలోచనలకి స్వస్తిచెప్పి, ఆవేశంగా లోనికెళ్ళింది.

రంగరాజు గదిలో తీరుబడిగా కూర్చుని ఫోన్లో ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

" అవునండి ! కుర్రనాయాలు ఏడనించి వచ్చిండో, కారు కింద పడ్డాడండి ! ఆ .. చనిపోయాడండి ! అవును – కారుని అక్కడే వదిలేసి వచ్చా ! డ్రైవరు నాగయ్యని పంపించాను – వచ్చాడా ? ఆడి పేర్న కేసు బుక్ చెయ్యండి ! జైలు సిచ్చపడితే జైల్లో

కూకుంటాడు. ఏమవుద్ది ? అలాగే ..... ఈ గొడవంతా అయ్యాక ఓసారి తమరు నన్ను కలవండి. మీ కష్టం వుంచుకోను...మంచిది – వుంటాను మరి ”.

ఫోను పెట్టేసి వెనిక్కి తిరిగాడు రంగరాజు.

ఎదురుగా రాజమ్మ ! కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ నిలబడుంది.

రంగరాజు ఒక్క క్షణం కంగారు పడ్డాడు.

కానీ మరుక్షణం తేరుకుని. “ జరిగిందేదో జరిగింది. ఎంత కావాలో సెప్పు – ఇచ్చే స్తాను ” అన్నాడు గొప్పగా నవ్వుతూ

రాజమ్మ అలాగే నిలబడుంది. ఏడుస్తూనే వుంది. ఆమె ఏం మాట్లాడలేదు.

ఆమె మౌనంతో రంగరాజుకి కాస్త ధైర్య వచ్చి,“ భయపడక ! ఎవ్వరికీ తెలీదు – ఎంత కావాలి ? ” అన్నాడు.

రాజమ్మ అసహ్యంగా అతడివంక చూసి, “ నా భర్తెక్కడ ? ” అని అడిగింది.

“ ఆడు యాక్సిడెంటు చేసాడు. కుర్రవాణ్ణి చంపేసాడు. పోలీసోళ్ళు పట్టుకెళ్ళారు ”

“ అంతా అబద్దం. ఆ యాక్సిడెంటు చేసింది నువ్వు. పిల్లాడిని చంపింది నువ్వు ”

“ అని అంటే ఎవరు నమ్ముతారు ? నీ మాటెవరింటారు ? ” హుందాగా అన్నాడు రంగరాజు.

“ చనిపోయిన ఆ పిల్లాడెవడో తెల్సా ? ” కళ్ళు తుడుచుకుని అడిగింది.

“ తెలీదు ”

“ నా కొడుకు ”

రంగరాజు ఆశ్చర్యపోయాడు. “ నిజంగా నాకు తెలీదు ” అంటున్నప్పుడు అతడి కంఠంలో ఎటువంటి మార్పులేదు.

రాజమ్మ విషాదంగా నవ్వి. “ తెలీక చేసినవి కొన్ని – తెల్సి చేసినవి మరికొన్ని. తెలిసి నా శీలాన్ని దోచావ్ – తెలీక నా ఒక్కగానొక్క కొడుకుని బలితీసుకున్నావ్. కావాలని నేరం నా భర్తమీద మోపి జైలుకి పంపావ్. రంగరాజూ ! గుర్తుపెట్టుకో – నా కడుపులో చిచ్చు రగిల్చావ్. అది ఆరదు ! మారణహోమమై నిన్నూ, నీ ఆస్థిని , నీ హోదానీ మసి చేస్తుంది. ఆస్తి, అంతస్థు అన్నీపోయి దిక్కులేని జీవితం గడుపుతావ్. ఇది నా శాపం. గుర్తు పెట్టుకో ” అనేసి వెనక్కి తిరిగి, మెట్లు దిగి వెళ్ళిపోయింది.

రంగరాజు పగలబడి నవ్వుతూనే వున్నాడు చాలా సేపు.

పాంచాలిని పరాభవించిన కౌరవ సామ్రాజ్యం నామ రూపాల్లేకుండా నాశనమైంది.

సీత కడుపులో చిచ్చు రేపిన రావణుడి లంక మట్టిలో కల్సిపోయింది.

అనార్కలీకి సజీవసమాధి కట్టించిన మొగలాయి సామ్రాజ్యం మరో సమాధిగా మారింది.

ఒక అబల కడుపులో రేగిని చిచ్చులో – రాజులు, చక్రవర్తులు, సామ్రాజ్యాలు, వారి అష్టయిశ్వర్యాలు, వారి చతురంగబలాలు కాలి, మసైన్పుడు ! ఈ రంగరాజు , వాడి చిన్న బంగళా, లక్షలాస్థి ఏ మూలకి ?

ఇవ్వన్నీ ఆ వూరి జనం వూహ కందని విషయాలు.

వాళ్ళకి తెలిసిందల్లా – రాజమ్మ పాడుబడ్డ బావిలో పడి ఆత్మహత్య చేసుకుందని,

ఆమె మరణ వార్త ఆ వూరిని పొగ మంచులా కమ్మేసింది.

**నీలిమ మార్చి 1979**

## ------- అయ్యిపోయింది -------